చెట్లకింద బోధన.. పాఠం చెవికెక్కేనా?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుడేకల్ పాఠశాలకు నాడు–నేడు కింద రూ. 2.40 కోట్లు మంజూరు
- 17 తరగతి గదుల నిర్మాణాలకు శ్రీకారం
- ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన పనులు
- మొండి గోడలు, చెట్ల కింద విద్యాబోధన


చెట్ల కింద రెండు తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరురూరల్: గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యాబోధన ఉండాలి, తరగతి గదుల కొరత ఉండకూడదు అనే ఉద్దేశ్యంతో నాడు–నేడు కింద పాఠశాలల్లో నూతన భనవ నిర్మాణాలు చేపట్టారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని గుడేకల్ జెడ్పీ హైస్కూల్‌లో తరగతిగదుల నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారడంతో చాలావరకు పాఠశాలల్లో నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు ఆరుబయట చెట్లకిందే చదువులు చెప్పాల్సివస్తోంది.

పనులు చేపట్టిని కాంట్రాక్టర్

మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 1,196 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో గదుల కొరతను దృష్టిలో పెట్టుకొని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకం కింద 20 నూతన గదుల నిర్మాణానికి రూ. 2.40 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 17 గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా.. 9 గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటికి ప్లాస్టరింగ్, గదులకు తలుపు, బడలు వేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ వచ్చి పడటంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆతరువాత ప్రభుత్వం మారిపోవటంతో పనులు ముందుకుసాగలేదు. భవన నిర్మాణాలకు నిధులున్నా బిల్లులు వస్తాయో రావేననే సందేహంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవటంతో విద్యార్థులు కష్టాలు పడాల్సి వస్తోంది.

చెట్ల కింద, అసంపూర్తి గదుల్లో తరగతల నిర్వహణ

పాఠశాలలో 6 నుంచి ఒక్కొక్క తరగతికి రెండు సెక్షన్లు పెట్టి తరగతులు బోధిస్తున్నారు. గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో చేసేది లేక ఉపాధ్యాయులు తరగతులను చెట్ల కింద, అసంపూర్తి గదుల్లో మొండి గోడల మధ్యే పాఠాలు బోధిస్తున్నారు. వర్షాలు వస్తే తరగతలు బోధన కష్టతరంగా మారిపోతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మార్పు రావటంతో చలి విపరీతంగా ఉంటుండటంతో ఆరుబయట తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఆరుబయట చదువులు చెబుతుండటంతో విద్యార్థులు ఉపాధ్యాయుడు చెప్పే పాఠంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. తరగతి గదులు నిర్మాణాలు పూర్తి చేస్తే చక్కగా బోధన చేసుకోవచ్చునని అధ్యాపకులు అంటున్నారు.


వంట గది లేక చెట్ల కిందనే మధ్యాహ్న భోజనం పథకం

చెట్ల కింద మధ్యాహ్న భోజన వంటకం

జిల్లా పరిషత్ పాఠశాలలో 1,196 మంది మధ్యాహ్న భోజనం చేసే వంట ఏజెన్సీలకు వంట గది లేకపోవడంతో చెట్ల కింద వంటలు చేస్తున్నారు. చెట్ల కింద భోజనం చేస్తున్నప్పుడు చెట్ల పై నుంచి విష పురుగులు వంటల్లోకి పడ్డా, చెత్తా పడిన విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వర్షాలు వస్తే వంట తయారు చేయటానికి ఏజెన్సీలకు నరకంలా ఉంటుంది. వంట చేసేటప్పుడు గాలులు వచ్చినా ఇబ్బందులు పడాల్సిందే.


పాఠశాలలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న నూతన భవనాలు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గదుల నిర్మాణాలు నిలిచిపోయి విద్యార్థులు తరగతులు చెట్ల కింద చెపుతున్న విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. గదుల నిర్మాణాలకు నిధులు ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో పనులకు ఆటంకం కలిగింది. పంచాయతీరాజ్ అధికారులకు చెప్పడంతో వారం కిత్రం వచ్చి చూసి వెళ్లారు. పూర్తయిన భవనాల్లో కింద బండలు, ప్లాస్టరింగ్ చేయాలని కోరగా.. చేయిస్తామని అధికారులు చెప్పారు కానీ ఇంత వరకు పనులు మొదలు కాలేదు. విద్యాబోధన చాల ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలి.

– నరసప్ప, ప్రధానోపాధ్యాయుడు, గుడేకల్ జెడ్పీ స్కూల్

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఎస్‌ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో ప్రశ్నాపత్రాలు లీకేజీ అయ్యాయని, దాని వెనుక ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థ హస్తం ఉందని అప్పట్లో తేలిందన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ప్రశ్నాపత్రాల లీకేజీలు మొదలయ్యాయని చెప్పారు. ఇటీవల మొదలైన ఏస్ఏ–1 పరీక్షల్లో భాగంగా పదో తరగతి పరీక్ష మొదలైన గంటలోనే ప్రశ్నా పత్రం ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైందన్నారు. ఆ వెంటనే ఆ పరీక్షను నిలిపివేశారని ఈ లీకేజీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. ఇందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఘర్షణ.. వీఆర్‌ఏకు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం అవరణలో బుధవారం సాయంత్రం పొలం సర్వే విషయంలో ప్రైవేట్ సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్‌ఏ మల్లికార్జునల మధ్య ఘర్షణ జరగడంతో వీఆర్‌ఏకు గాయాలు అయ్యాయి. మండల పరిధిలోని టీఎస్ కుళ్లూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మల్లికార్జునకు తన పొలం విషయంలో వేరే వ్యక్తితో వివాదం నడుస్తోంది. కొన్ని రోజులుగా పొలం వివాదంపై రెవెన్యూ కార్యాలయంలో ఇరువురు ఫిర్యాదు చేసుకోవడంతో విచారణ నడుస్తోంది. అయితే పొలం వివాదంలో ఉండగానే సర్వే చేయడంతో.. వీఆర్‌ఏ మల్లికార్జున ప్రైవేట్ సర్వేయర్‌ను ప్రశ్నించాడు. మాటామాటా పెరగటంతో వివాదం పెరిగింది. ఇద్దరు ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దకున్నారు. అయితే ఈ ఘర్షణలో వీఆర్‌ఏ మల్లికార్జున ముక్కుకు గాయం అయ్యింది. ఘటనపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వీఆర్‌ఏ మల్లికార్జున తెలిపారు.

క్లుప్తంగా

స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ


చిన్నారులకు స్వర్ణామృతం మందు వేస్తున్న పట్టణ అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్త

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషన్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో వికాస తరంగిణి వారి సహకారంతో చిన్నారులకు స్వర్ణామృత ప్రసానం మందును పంపిణీ చేశారు. బుధవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో 259 మంది చిన్నారులకు 6వ విడత కింద మందు అందజేసినట్లు దాత కాకుబాళ్ నగేష్, పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్త తెలిపారు. పిల్లలకు ఈ మందు రోగ నిరోధకశక్తి, మేధాశక్తి పెంచడానికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా కార్యదర్శులు రఘు, ఉపాధ్యక్షులు ఈరన్నశెట్టి, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు రాజేష్, రత్నయ్య, అవోపా మహిళా విభాగం సభ్యులు వంకదారు మమతాశ్రీ, సంగీత, హిమబిందు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప అన్నారు. సమస్యల సాధనలో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవదిక దీక్షలు బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్, హంసరాజు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు

నందవరం: మండలంలోని మాచాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు తూతూ మంత్రంగా సాగింది. బుధవారం గ్రామంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ జనాలు లేక బోసిపోయింది. ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. గ్రామంలో భూ సమస్యలకు సంబంధించి 3 అర్జీలు మాత్రమే అందిచారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు,ఆర్ఎస్‌టీడీ మహేష్, ఆర్ఐ జెర్మియ, మండల సర్వేయర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్‌పీఎస్‌ఎఫ్, ఆర్‌యూఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు షాహిద్ అఫ్రిది, రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఎస్సీ బాలుర, బాలికల సంక్షేమ హాస్టళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేక తల్లిదండ్రులు వలస వెళుతున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆదోని పట్టణంలోని నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫీజుల పేరుతో అకాడమిక్ మొదలుకొని, చివరి వరకు అనేక రకాలుగా విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. తక్షణమే ఫీజుల ఒత్తిడి లేకుండా మేనేజ్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ డివిజన్ సెక్రటరీ శివ, పట్టణ కార్యదర్శి రాజేష్, తరుణ్, పవన్, నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పునఃప్రారంభించాలి

ఆదోని సెంట్రల్: ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని విద్యార్థి జేఏసీ, యువజన సంఘాల నాయకులు లింగప్ప, సూరి రమేష్, ఉదయ్, మల్లి, లోకేష్ ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. బుధవారం సాయి కళాశాలలో విద్యార్థి యువజన సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అర్ధంతరంగా పనులను నిలిపివేయడమే కాకుండా, అడ్మిషన్లను జరగకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే డా.పార్థసారథి ఒక్క రోజు కూడా మెడికల్ కళాశాలపై మాట్లాడలేదని విమ ర్శించారు. మెడికల్ కళాశాల పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నా రు. పనులను ప్రారంభించే దాకా పోరాటం చే యాల్సిందే నని వారు తీర్మానించారు. అందుకు ప్రజా సంఘాల నాయకులు మద్దుతు ఇవ్వాలని కోరారు.

ఘనంగా దేవర


పూజలందుకుంటున్న మారెమ్మదేవి

కౌతాళం: మండల పరిధిలోని రొడూరు, పొదలకుంట, చిరుతపల్లి, గొతులదొడ్డి గ్రామాల్లో దేవర మహోత్సవం వాడవాడల ఘనంగా జరిగింది. బుధవారం తెల్లవారు జామున 2గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అంతకు ముందు దేవాలయాల్లో ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు కుంభాలతో తరలివచ్చి మారెమ్మఅవ్వ, సుంకులమ్మ దేవి ఆలయాల్లో పూజాలు నిర్వహించారు. తెల్లవారు జామున నాల్గు గంటలనుంచి ప్రారంభం అయిన ఈ కుంబోత్సవం కార్యక్రమం మధ్యహ్నం వరకు కొనసాగింది. రొడూరులో జరిగిన దేవరలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు సుబ్బారాజు, ఉప్పరహాల్ ఏకాంబర్‌రెడ్డిలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్ని చేపట్టారు.


కర్నూలులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌గౌడ్, ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి.

ఇంధన పొదుపుతో భవిష్యత్‌కు రక్ష


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: ఇంధనం పొదుపు చేసుకుంటూ మన భావితరాల భవిష్యత్‌ను రక్షించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆదోని మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేసుకుంటూ బిల్లును తగ్గించుకోవాలన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించుకుంటే పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించిన వారమవుతామని చెప్పారు. ప్రతిఒక్కరూ సబ్సిడీపై అందిస్తున్న రూఫ్ టాప్ సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ అధికారులు హరి, పురుషోత్తం, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో పట్టణాభివృద్ధి


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: ప్రత్యేక ప్రణాళికతో పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని గూడూరు బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఆప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.


భూ సమస్యలపై విచారణ చేపడతాం

ఆదోని రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. బుధవారం మండలంలోని ఢణాపురం, వి.కొండాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

23 నుంచి ఉరుసు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గా 10వ ధర్మకర్త సయ్యద్ సాహెబ్‌పీర్ హుసేని చిష్తీ (సాని ఖాదర్ లింగస్వామి) ఉరుసు ఈనెల 23 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త జైనూలాబుద్దీన్ హుసేని తెలిపారు. ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం గుల్బార్గా బందేనవాజ్ దర్గాల పీఠాధిపతులు సయ్యద్‌షా అలిఅల్ హుసేని, సయ్యద్ ముస్తఫా హుసేని, గంజెబక్ష్ దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా అఖిల్ హుసేని, సయ్యద్‌షా నిజామ్‌హుసేని చేతుల మీదుగా విడుదల చేశారు. దర్గా ధర్మకర్త మాట్లాడుతూ కర్ణాటకలోని కురుగోడులో కొలువైన సయ్యద్ సాహెబ్‌పీర్ హుసేని (సాని ఖాదర్‌లింగస్వామి) ఉరుసు ఉత్సవాలు ఈనెల 23 నుంచి 26వ వరకు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న గుసూల్ కార్యక్రమం, 24న గంధం , 25న ఉరుసు ఉత్సవం, 26న జియారత్ వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. గంధాన్ని కౌతాళంలో వెలసిన ఖాదర్‌లింగస్వామి దర్గా నుంచి వైభవంగా కురుగోడుకు తీసుకుని వెళ్తామన్నారు. కార్యక్రమంలో కురుగోడు ధర్మకర్త సయ్యద్ మైనుద్దీన్ హుసేని చిష్తీ, ఖాదర్‌లింగస్వామి శిష్యరిక బృందం పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీకి ఆదాయం



వర్మీకంపోస్టు అమ్మకాలు జరుపుతున్న దృశ్యం

గోనెగండ్ల : వర్మీకంపోస్టు ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలని డీపీఆర్సీ రిసోర్స్ పర్సన్ జేమ్స్ కుపావరం అన్నారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త నుంచి తయారు చేసిన వర్మీ కంపోస్టు విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కేజీ వర్మీకంపోస్టు ధర రూ.10లగా నిర్ణయించారు. ఇంటి దగ్గర పూల మొక్కలకు గాను 30 కేజీల వర్మీని కొంతమంది ఉద్యోగులు, ప్రజలు కొనుగోలు చేశారు. గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ సతీష్ మాట్లాడుతూ వర్మీ కంపోస్టును మిరప, ఉల్లి, పంటలతో పాటు ఇతర పంటలకు కూడా వేయవచ్చునని తెలిపారు. ఈ ఎరువును వాడడం ద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. 50 కేజీ బస్తా రూ.750గా నిర్ణయించామని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో 100 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మలాంగ్, అనిల్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదాలు వేస్తుంటే అభివృద్ధి ఎలా జరుగుతుంది?

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల నిలదీత
- ప్రతి దానికి బీజేపీ కౌన్సిలర్లు ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన
- అభివృద్ధిపై చర్చిద్దామని ఎమ్మెల్యేకు వైస్ చైర్మన్ సవాల్


నిరసన తెలియజేస్తున్న కౌన్సిలర్లు

ఆదోని టౌన్: 'గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశం జరుగుతూనే ఉంది.. ఒక్క అంశం కూడా పాస్ కావడం లేదు.. అజెండాలోని అంశాలన్నీ వాయిదా పడుతూనే వస్తున్నాయి'.. ఇలా అయితే పట్టణ అభివృద్ధి ఎలా జరుగుతుందంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు నరసింహులు, సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాషా ప్రశ్నించారు. బుధవారం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ 2025–26 బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సమావేశంలోనూ బీజేపీ మద్దతు పాలకవర్గ సభ్యులు ఏదో ఒక వంక పెట్టుకుని సమావేశం జరగకుండా ఆటంకం కలిగించడం, నిరసనలు తెలియజేయడంతోనే సరిపోతుందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, బీజేపీ కౌన్సిలర్లు లలితమ్మ, సురేష్, పార్వతిల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆదోని అభివృద్ధి చెందాలంటే కౌన్సిల్ సమావేశం జరగాలి, అందులో సమస్యలపై తీవ్రంగా చర్చ జరగాలి, అప్పుడే అభివృద్ధి సాధ్యమని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి అన్నారు. ప్రతి చిన్నవిషయాన్ని పెద్దదిగా చేసి కౌన్సిల్ సమావేశానికి ఆటంకం కలిగిస్తూ వాయిదాలు, కాలయాపన చేస్తున్నారే తప్పా పనులు జరగడం లేదంటూ సభ్యులు, అధికారులను నిలదీశారు. స్పీకర్ పోడియం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు.

ఆదోని మున్సిపల్ బడ్జెట్ ఇలా..

ఆదోని మున్సిపాలిటీకి 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆదోని మున్సిపల్ బడ్జెట్ అంచనాలు, రాబడి, ఖర్చులు అజెండాలో ప్రవేశపెట్టగా, పాలక వర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2919.20 లక్షలు ముగింపు నిల్వగా చూపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికిగానూ బడ్జెట్‌లో రూ.2,919.20 లక్షలు ప్రారంభ నిల్వగా చేసుకోగా, రూ.5,208.70 లక్షలు రాబడి, రూ.6,172.47 లక్షలు ఖర్చు కాగలదని అంచనా. మొత్తం ప్రారంభ నిల్వతో వెరసి రూ.8,127.90 లక్షలు ఆదోని మున్సిపల్ బడ్జెట్‌గానూ చూపారు. ఈ మొత్తం నుంచి రూ.6,172 లక్షలు పోనూ రూ.1,955.43 లక్షలు ముగింపు నిల్వలుగా అంచనా వేశారు.

ఏ మేరకు నిధులు మంజూరు చేయించారు?

ఆదోని మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏ మేరకు నిధులు మంజూరు చేయించారు, ఏయే అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని వైస్ చైర్మన్లు నరసింహులు, బాషా ఎమ్మెల్యే పార్థసారథిని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఆదోని పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకం, వార్డు, వార్డు, సందు సందున సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏఏ పథకాలతో ఎంతమేర అభివృద్ధి జరిగిందో చర్చిద్దామంటూ వైస్ చైర్మన్ నరసింహులు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. రాష్ట్రస్థాయిలో నంబర్ వన్ మున్సిపాలిటీ ఆదోని అని, ఫాగింగ్ మిషన్లు లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయని వైస్ చైర్మన్‌లు నరసింహులు, బాషా, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లామని, అయినా పరిష్కారంకాలేదని, వెంటనే పరిష్కారం చేయాలని కోరారు.

ఆదోని మెడికల్ కళాశాలపై చర్చ

కర్ణాటక రాష్ట్రానికి చేరువలోనూ, రాష్ట్రానికి దూరంగా ఉన్న ఆదోనిలో మెడికల్ కళాశాల ఏర్పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టారని, అయితే పనులు పూర్తికాగానే కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని సభ్యులు సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణం పనులు కేవలం 25 శాతమే పనులు జరగడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో పనులు చేపట్టి మరో యేడాదిలో కళాశాలను ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే పార్థసారథి కౌన్సిల్‌లో చెప్పారు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడిన ఈ ప్రాంత ప్రజలకు మెడికల్ కళాశాల అవసరం ఎంతైనా ఉందని, తాము కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, రెండో దశలో తప్పకుండా ప్రారంభిస్తామని, ప్రభుత్వాలు గట్టిగా చెప్పాయన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు


అన్నమయ్య సర్కిల్‌లో టిఫిన్ సెంటర్ నిర్వాహకులను హెచ్చరిస్తున్న మున్సిపల్ అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిక ప్లాస్టిక్‌ను హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వ్యాపారులు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ ఏరియాలోని టిఫిన్ సెంటర్లు, దుకాణాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకొని, జరిమానా విధించి, యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో సాంబారు, టీ లాంటివి ప్యాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యానికి హని కలిగిస్తాయన్నారు. ప్రత్యామ్నాయమైన వస్తువులపై దృష్టి సారించాలని సూచించారు.